# చీపురు

అర్థరాత్రి....

యుద్ధ విరామమైనట్టు... అలసిపోయిన నగరం అర్ధ స్వప్నాలతో నిద్రపోతోంది. చలి నిశ్శబ్దంగా ముట్టడిస్తోంది...

మోర్క్యూరీ లైట్ల వెలుతుర్లో కన్పించకుండా కురుస్తున్న మంచు...

రోడ్లన్నీ నిర్మానుష్యం...

ప్రశ్నార్థకంగా వంగిపోయిన నడుంతో... జవాబుల్ని తట్టి లేపుతున్న చీపుర్లు... తల్లి లేని కోడిపిల్లలు వడ్ల గింజల కోసం దుమ్మురేపుతున్నట్టు... నగరం పుక్కిలించిన చెత్తని ఊడుస్తూ... 'చెత్త'ందార్లలా... మప్పయి మంది దాకా వుంటారు.

అలవాటు పడక ఆయాసంతో ఊడుస్తున్న చీపురు పడేసి నిటారుగా లేచి వెనక్కి వంగుతూ నడుం మీద చేతులేసి ఒళ్ళు విరుచుకుంది సుజాత.

సుజాతకి ఇరవై ఏళ్లుంటాయి... ఈ మధ్యే మొగుడితోని పట్నానికొచ్చింది. పదో తరగతి పాసైన సుజాత... పట్నంలో నీక్కూడా పని చూసిన అని మొగుడు తీసుకొస్తే ఏమిటో అనుకుంది....

నేను ఆ పనికెళ్లను అని మొదటిరోజు అంటే... 'ఊడ్చుడం కూడా చేతగాక పోతే నువ్వేం ఆడదానివి' అంటూ కసురుకున్నాడు. 'నిన్నూ, పిల్లాడిని పోషించటం నా వల్లకాదు. పుస్తకాల పిచ్చి వున్న దానివి పదో తరగతి చదివి ఎందుకాపు జేసినవ్... ఇంకా బాగా చదువుకొని నౌఖరి చేసెటోన్ని పెండ్లి చేసుకోవల్సింది" అని దెబ్బలాడిండు. పక్కింటోల్లను ఆదివారం మేగజైన్ అడుక్కొని వచ్చి చదువుతూ... పిల్లాడు ఏడ్వటం చూడకపోతే పుస్తకాన్ని లాక్కొని బరబరా చింపిండు. నర్సింలు సుతారి పని చేస్తాడు. ఏ మాత్రం చదువురాదు. రోజుకి నూట యాభై రూపాయల పైనే సంపాదించినా సగానికి పైనే తాగడానికి ఖర్చు చేస్తాడు. సంసారం గడవటం కష్టమైపోయింది.

ఇక సుజాత చదువుమీద మమకారం చంపేసుకుంది. అప్పుడప్పుడూ తను రాసుకున్న చిని చిన్ని కవితల కాపీని పెట్టెలోంచి తీసి అపురూపంగా చదువుకుంటుంది.

కలలు ఉప్పెనలవుతున్నప్పుడు నిద్ర పట్టని రాత్రులే తెల్సు తనకు... కానిప్పుడు... నిద్రని చంపేసి రాత్రినే ఉద్యోగంగా మార్చిన కాంట్రాక్టు

స్వీపరైపోయింది... నగరాన్ని ఊడ్చే చీపురైపోయింది... గబ్బిలం బతుకైపోయింది.

అర్ధరాత్రి నించి... ముక్కలు ముక్కలుగా సూరీడు తెగి జారిపడేదాకా ఊడిస్తే... అరవై రూపాయలు!!

"ఏంది పిల్లా... నడుం గుంజుతుందా... చలికి మొగుడు యాదికస్తుండా?" బరబరా ఊడుస్తూనే అడిగింది నడివయసు రాజేశ్వరి... అంత అలసటలోనూ సుజాతకు సిగ్గు ముంచుకొచ్చింది.

"అది కాదత్తా... అలవాటు లేనిపని... అందునా రాత్రంత నిద్రలేని పనాయె" అనుకొని మళ్లీ చీపురు పట్టింది.

డివైడర్ పక్కన ఊడుస్తుంటే... స్పాంజితో చేసిన నలిగిపోయిన బార్బీ బొమ్మ కన్పించింది. ఆ బొమ్మని చేతుల్లోకి తీసుకుంటుంటే... చివాలున చిన్నోడు గుర్తొచ్చాడు.

పాలకోసం పక్కమీద పొర్లుతున్నాడేమో... నిద్రలో వెక్కిళ్లు పడ్తున్నాయేమో... మొగుడు బాగా తాగొచ్చి నిద్రపోతాడు. వాడు ఏడిస్తే ఎవరికి విన్పిస్తుంది???

చీపురు అక్కడే పడేసి ఇంటికి పరిగెత్తాలనిపించింది. చలి ఎక్కువవుతుంటే... కళ్లల్లో నీళ్లు తిరిగి డివైడర్ మీద కూలబడింది. బొమ్మని పట్టుకొని... గుండెల మీద చెయ్యేసి చూసుకుంది... పాలున్నాయి... బిడ్డే దగ్గర లేడు... కోపంగా బొమ్మని విసిరేసింది.

"ఏందే... మారాణి లెక్క కూసున్నవ్... ఊడ్చెయ్.. ఊడ్చెయ్..." మల్లమ్మ గద్దాయించింది. సుజాతకి ఈ బతుకే రోతనిపించింది. మళ్లీ చీపురందుకుంది. పల్లెలో చెరువులెండిపోయినాక వ్యవసాయ కూలీ పనులేవీ దొరక్క భర్త పట్నమొచ్చిండు. అపార్ట్‌మెంట్ నిర్మాణాలల్లో మేస్త్రీ దగ్గర పని చేస్తాడు. పొద్దంతా

పోయి రాత్రి అతడు ఇంటికొస్తే... పొద్దంతా కలత నిద్రపోయి రాత్రి చీపురు తీసుకొని తాను రోడ్డున పడాలి.

వండి వార్చాక... చంటాడిని నిద్ర పుచ్చాక... వాణ్ణి చూస్తూ కదల్లేక కదల్లేక అరవై రూపాయలు గుర్తొచ్చి... అడుగులు ముందుకు పడతాయి.

సుజాత ఊడుస్తుంటే... ఎన్నెన్నో ఆలోచనలు...

ఎవడి దిష్టిబొమ్మ తగులబెట్టారో... గాంధీబొమ్మ చౌరస్తా దగ్గరంతా బూడిద... కాలిపోయి చీలికలైన బ్యానర్‌లు....

సుజాతకి చిర్రెత్తుకొచ్చింది... 'దొంగనాయాళ్లు... దేశంలో ఎక్కువైపోయారు అనుకుంది. గాంధీ దిక్కు చూసింది... ఆయన నవ్వుతున్నాడు. తన కోరకి తీరి 'అర్ధరాత్రి ఆడది సంచరిస్తున్న స్వతంత్రం కన్పిస్తుందని...' సుజాత నవ్వింది. 'నీకు పల్లుంటే... ఏ టూత్‌పేస్ట్ కంపెనియో అడ్వర్టయిజ్‌మెంట్ కోసం నిన్ను వాడుకునేదని...'

రోడ్డు ఊడుస్తుంటే సుజాతకి చాలా ఆలోచనలు వస్తాయి. ఇల్లు ఊడ్చేటప్పుడు 'చీపురు' తనకి ఉద్యోగావకాశమై కూచుంటుందని ఎప్పుడూ అనుకోలేదన్న ఆలోచన రాగానే నవ్వుకుంటుంది. పదో తరగతి పాఠ్యపుస్తకాలు... స్కూలు లైబ్రరీ పుస్తకాలు సుజాత ఆలోచనల్లోకి అర్ధాంతరంగా చొచ్చుకు వస్తుంటాయి. పెళ్లయ్యేదాకా ఖాళీగా వున్న అయిదేళ్లు పల్లె లైబ్రరీలోని పుస్తకాలన్నీ చదివేది. చిన్న చిన్న కవితలూ రాసుకునేది... పేదరికమే చదువుకు అడ్డుపడింది...

బూడిదంతా ఊడ్చేస్తుంటే దుమ్మురేగుతోంది... సుజాతలో ఏదో కసి... ఆ ప్రదేశాన్ని గట్టిగా ఊడ్చేయాలని ప్రయత్నిస్తోంది. మనసు ఘోషిస్తోంది...

ఊడ్చేయ్... ఊడ్చేయ్... లారీల్లో వచ్చి కుమ్మరించిన నినాదాల్ని... అన్నం పాకెట్లకోసం పారేసుకున్న అరుపుల్ని... విషం చిమ్మే ఇవియంలని...

రాజకీయ రాకసి బల్లుల పాదముద్రల్ని...

నడుం మళ్లీ లాగింది... చీపురు అక్కడే పడేసి చలి వణికిస్తుంటే పేవ్‌మెంట్ మీద కూలబడింది. పేవ్‌మెంట్ల మీద చాలీచాలని చిరుగుల దుప్పట్లతో మునగదీసుకు పడుకున్న బిచ్చగాల్లు... ఒక పిచ్చిది దగ్గుతూ మూల్గుతూ వుంది. మూసేసిన షట్టర్లమీద షాపుకి సంబంధించిన రంగురంగుల బొమ్మలు... సుజాత కూచున్న దగ్గర్లోని షట్టర్‌ని చూసింది... షాపు ముందు రంగుల మరకలు... రెండు మూడు ఎండిపోయిన బ్రష్‌లు.. రంగులు కలగలసిన చిప్ప కన్పడింది. సుజాత ఆ ప్రాంతంలోనే తిరిగేది కాబట్టి... ఇప్పుడు రాత్రేకాదు పగలు కూడా షట్టర్ తెరుచుకోవటం లేదు... అందులో బోర్డులు రాసేటాయన ఎక్కడ పోయిండో...

చచ్చిపోయిండా...?

చప్పున వచ్చిన ఆలోచన... ఛఛ... పాడు ఆలోచన అనుకుంది. ఏమో... చచ్చిపోయాడేమో... మళ్లీ చుట్టు ముడుతున్న ఆలోచనలు... ఎవరు చంపేసి వుంటారు? ఎదురుగా బిల్డింగ్‌పైన బ్యాక్ లైటింగ్ ఫ్లెక్స్ బోర్డు మీద కోటు వేసుకొని నవ్వుతూ మెరిసిపోతున్నాడే... వాడే చంపేసాడేమో... ఏమో...

గుబులుగా చీపురు వైపు చూసుకుంది.

"సుజాతా... దొర్సాని లెక్కనే కూచున్నవేందే? కాంట్రాక్టర్ గాడు వచ్చి చూసిండంటే పనిలోంచి తీసేత్తడు... వచ్చి ఊడ్చేయ్ బిడ్డా..." అని హెచ్చరిస్తూనే ప్రేమగా పిలిచింది మంగవ్వ.

సుజాత మళ్లీ ఊడ్వటం మొదలెట్టింది... మనసులో తెలీని బాధ... 'ఊడ్చేయ్... వృక్షాల్ని చంపేసిన యంత్రాల్ని... డాలర్ కంపుతో కాలిపోతున్న కంప్యూటర్లని... ఇకిలిస్తున్న ఇమెయిల్లని... ఊడ్చేయ్...'

ఎంత ఊడ్చినా కదలని చెత్తలా... వాస్తవాలన్నీ ఆవిష్కరించని దృశ్యాలై

కన్పిస్తాయి.

ఒక మారుతీవ్యాను చాలా వేగంగా రోడ్డుకడ్డదిడ్డంగా పరిగెడుతూ వస్తోంది. అది చూసి మిగతా స్వీపర్లంతా తలోదిక్కు పరిగెత్తారు. అదొక డివైడర్‌ని ఢీకొట్టి... రొడ్డుపక్క పేవ్‌మెంట్ మీదికి దూసుకెళ్లి, అక్కన్నించి మళ్లీ రోడ్డెక్కి వేగంగా వెళ్లిపోయింది. కొంచెమైతే పోచవ్వని గుద్దేసిపోయేది.

"దొంగ లంజాకొడుకులు.. బాగా తాగినట్టున్నారు..." మైసమ్మ గట్టిగా తిట్టింది. మారుతీ వ్యాను అంత వేగంగా వెళ్లినప్పటికీ... మూసివున్న అద్దాల్లోంచి హెల్ప్... అంటూ ఓ ఆడదానికేక సుజాత చెవిని తాకింది.

మంచుతో కాక... భయంతో శరీరం గడ్డకట్టుకుపోయినట్లనిపించింది. ప్రతి రాత్రీ... ఒక యుద్ధానుభవం... గాయాలను స్పృశించినట్టు రోడ్డుని ఊడ్చేయటం. సుజాత మనసంతా నిస్పత్తువ ఆవరించింది.

అందరిలా తనూ పని చేసుకోక... ఎందుకీ ఆలోచనలు... ఊడ్వటం తన పని... కాని... తన చీపురు ఒక వాయులీనం అవుతోంది. చదువుకున్న భావనా ప్రపంచపు జ్ఞాపకాలు తెగిపడుతూ... ప్రాణవాయులీనమవుతోంది.

ఇంతలో... స్థంబం పక్కగా ఊడుస్తున్న సూరక్క గట్టిగా అరిచింది... అందరూ ఆందోళనగా చీపుర్లు పడేసి పరిగెత్తారు.

స్థంబం పక్క చెత్తగుండీ దగ్గర్లో... ఓ పసికందు శవం...

చుట్టూ ముగారు... అబార్షన్ల మీద, అక్రమ సబంధాల మీద మాటలతో దాడి చేసారు. తమ చీపుర్లకే ఆ కాలుష్యాన్ని కడిగేసే బలముంటే... అన్నంతగా ఆవేశపడిపోయారు.

మళ్లీ పనిలో మునిగిపోయారు.

చెత్త ట్రాక్టర్ వచ్చింతర్వాత పసికందు శవాన్ని అందులో పడేసారు.

సుజాతకి ఆ పసిగుడ్డును చూడగానే బాధేసింది... కాళ్లు కదల్లేకపోయాయి. అలాగే నిల్చుండిపోతే... "సుజాతా... చదువుకున్నదానివి... ఈ పనికి రాకు బిడ్డా..రేపు కాంట్రాక్టర్‌తోని చెప్తతియ్..." జాలిగా అంది రత్నవ్వ. ఆ మాటకు ఉలిక్కిపడింది సుజాత.

గబగబా చీపురందుకుంది... ఏదోకసి... ఊడుస్తుంటే ఎవరో పాప పడేసుకున్న నోటు పుస్తకాల కాగితాలు గాల్లోకి లేచాయి.

కసిగా ఊడుస్తోంది... మనసంతా మళ్లీ సుడులు...

"ఊడ్చేయ్... బాల్యాన్ని కొరికేసిన పుస్తకాల్ని... పిండాల్ని నలిపేసిన పేగుల్ని.. కార్పోరేట్ కాలేజీలు విరిచేసిన రెక్కల్ని... రహదారుల మీద తెగిపడ్డ అవయవాల్ని... ఆస్పత్రులు గెంటేసిన అనాథ శవాల్ని... ఊడ్చేయ్... ఊడ్చేయ్..."

ఎముకలు కొరికే చలిలో చీపురు మొరాయిస్తోంది.

సుజాత మనసు ఏదేదో పలవరిస్తోంది... చీపురుకు అడ్డం పడిన డైలీ పేపర్ ముక్కని తీసింది. మోర్క్యూరీ బల్బుకింద పేపర్‌లోని ఒక వ్యాసం కళ్లని తాకింది.

నగరానికి క్లీన్‌సిటీ అవార్డ్.

వాక్యం కింద ఫోటోని చూసింది. ముఖ్యంగా ఆమె... ప్రధానమంత్రి చేతుల మీదుగా అవార్డందుకుంటున్న ఆమె... చాలా అందంగా... హుందాగా ఉంది. అవార్డ్ అందుకుంటూ చిరునవ్వుతో ఆమె మొహం వెలిగిపోతోంది.

ఆమె... నగర కమీషనర్.

కాని...ఆరోజు మమ్మల్ని చూడగానే ఎంతలా మొహం చిట్లించుకుంది. ఎంతగా అసహ్యించుకుంది... ఏసి గదిలోంచి బయటికి వచ్చిన పది నిమిషాల్లోనే చెమటలు పట్టి ఎంత కోపంగా చిర్రుబుర్రులాడుతూ పోయింది...

మూడు వందల కిలోమీటర్లున్న నగరాన్ని ఊడుస్తున్న పదిహేడు వందల మంది స్త్రీలంతా తమకు ఇన్సూరెన్స్ పథకాలు కావాలని... ప్రావిడెంట్ ఫండ్ కావాలని ఓరోజు మధ్యాహ్నం ఏకంగా అడగటానికి వెళ్తే... ఎంత నిర్లక్ష్యంగా జవాబిచ్చింది. 'అవన్నీ పగలు పని చేసేవాళ్లకే గాని... రాత్రి పనిచేసే వాళ్లకు వర్తించవని'

ఆమె మాటలకి... చీపుర్లన్నీ గాల్లోకి లేచి నిల్చున్నాయి. ఈచెత్త సంస్కృతిని ఊడ్చేయాలని ఒక్కో చీపురు.... ఒక్కో నినాదమైంది.

అమ్మ కొంగులా మారి... నగరాన్ని అద్దంలా తుడిచినా కనికరించని అధికారంపై చీపురు... ఒక ఆగ్రహమైంది...

అయినా చీపురు విన్నపం చెత్తబుట్ట పాలైంది. సుజాత ఆ పేపర్ని మడిచి విసిరికొట్టింది.

ఎవడో బాగా తాగి తూలుతూ వచ్చి రోడ్డమీదే భళ్లున కక్కుకున్నాడు. దగ్గర్లోనే ఊడుస్తున్న శ్యామల కొంగుపట్టుకున్నాడు. బూతుమాట తిట్టి చేయిపట్టి లాగాడు. శ్యామల మొత్తుకుంటూ వాన్ని తోసేసింది. మిగితావాళ్లంతా పరిగెత్తుకొచ్చారు.

అప్పుడు చీపురు... ఒక ఆయుధమే అయింది.

నాలుగు చీపురు దెబ్బలు తగలగానే... వాడికి తాగింది దిగిపోయిందేమో... వెనక్కి చూడకుండా పారిపోయాడు.

సుజాత నవ్వుకుంది... కడుపారా నవ్వుకుంది. అదీ కాస్సేపే... పేవ్‌మెంట్ మీద చిలుంపట్టిన పోస్ట్‌డబ్బా దగ్గర మూలుగులు విన్పిస్తే చూసింది. పన్నెండేళ్లు కూడా నిండని పిల్లాడు... చలికి నిద్రలో వణుకుతున్నాడు. చిరిగిన నిక్కరు... మాసిపోయిన బనియను... పల్చటి దుప్పటి... రోడ్డుకి అవతల బాలకార్మిక నిర్మూలన చట్టంపై ప్రభుత్వం వేసిన పెద్ద పోస్టరు...

మనసు వికలమై... అలాగే చూస్తుండిపోయింది. పల్లెలో ఇంటి దగ్గర తమ్ముడు గుర్తొచ్చాడు.

"గీ పట్నంల అన్నీ మాములే బిడ్డా... పట్టించుకుంటే పనైతదా... నీ పని నువ్వుచూస్కో... ఊడ్చేయ్" అంటూ వెళ్లింది సరోజన.

సుజాత మనసు ద్రవించింది... మౌనంతో సంభాషించింది.

"ఊడ్చేయ్... కలల్లా పగిలిపోయిన ఇరానీ కప్పుల్ని... పాసిపోయిన బాల్యమైన బిర్యానీ బొక్కల్ని... వలస బతుకుల చెరుకు పిప్పిని... ఊడ్చేయ్..."

చేతిలోని చీపురు ఏదో కసితో ఊడ్చేస్తోంది...

అంబులెన్స్ కూత చెవుల్ని బద్దలు చేస్తూ రావటంతో రోడ్డు పక్కకి జరిగింది.

అంబులెన్స్ వేగంగా వెళ్లిపోగానే... అయ్య గుర్తొచ్చాడు. అయ్య ఆరోగ్యం గుర్తొచ్చింది. ఎలా వున్నాడో... మందులేసుకుంటున్నాడో లేదో అనుకుంటూ ఊడ్చటం మొదలెట్టింది. పాటల్ని నిషేదిస్తున్నంత వేగంగా ఒక పోలీసు జీపు వెళ్లిపోయింది.

ఎదురుగా లైట్లతో మెరిసిపోతున్న ఎనిమిదంతస్తుల 'భల్లూకస్'గోల్డ్ ఎంపోరియుం బిల్డింగ్‌కున్న హోర్డింగ్‌లను చూస్తుంటే... సినీతారలు అలంకరించుకున్న నగలు చూస్తుంటే... తమ వూర్లో దొంగలు పడ్డప్పుడు దోచుకుపోయిన అమ్మ గంటెపుస్తెలు, నానుతాడు, పక్కింటి లలితక్క గుండ్లపేరు, యమునవ్వ కమ్మలు బుట్టాలు... అన్నీ వీళ్లే దోచుకొచ్చారేమో అన్పించింది.

బిల్డింగ్‌ని అలాగే చూస్తుంటే... చెవులు చిల్లులు పడేలా కిందినించి వెళ్లిపోయిన విమానం... చూడగానే శ్రావణి గుర్తొచ్చింది. తమ వూరి దొరగారి బిడ్డ... చిన్నప్పుడు తన క్లాస్‌మెట్... అమెరికా సంబంధం అని ఇస్తే ఇదే విమానంలో

శవాన్ని పంపించారు. విమానం శబ్దం విన్పడితే చాలు... చిన్నప్పటి శ్రావణి గుర్తొస్తది. జ్ఞాపకాలు శిథిలాలై రాలిపడుతాయి.

"సుజాతా... నువ్వు పని చేసేటట్టు లేవుగనీ... ఇంటికెళ్లి మొగని పక్కల పడుకోపో బిడ్డా..." సరసంగా అంది వెంకటమ్మ.

సుజాత మళ్లీ ఊడ్వటం మొదలెట్టింది. నాలుగు కావస్తోంది. వాహనాలు రోడ్డెకుతున్నాయి.

అప్పుడే కొంచెం చల్లగా గాలి వీచింది.

గాలివీచినా... వాన కురిసినా స్వీపర్లందరికీ భయం. ఊడ్చిన రోడ్లన్నీ మళ్లీ చిత్తడవుతాయి. కాంట్రాక్టరొచ్చి మళ్లీ ఊడ్చేదాకా తిడతాడు. అట్లే దీపావళి పండుగ వచ్చిందంటే నాలుగైదు రోజులు ఎంత ఊడ్చినా తెల్లారదు. కాళ్లు చేతులు నొప్పులతో పడిపోతాయి. కాంట్రాక్టర్ డబ్బులేమి ఎక్కువివ్వడు. దుకాణాల వెంట తిరిగి మామూళ్లు అడుక్కోమంటాడు.

మళ్లీ గాలి రివ్వుమని తగిలింది.... సుజాతకి భయమేసింది.

గాలి కొంచెం ఎక్కువైంది... అందులోనూ ఎదురుగాలి...

ఊడ్చిన చెత్త ఒక్కసారిగా గాల్లోకి లేస్తోంది. బెంగతో స్వీపర్లంతా ఊడ్వటం ఆపి నిల్చున్నారు.

మతకల్లోలం వచ్చినంత సడెన్‌గా... గాలి దుమారం ఎక్కువైంది. దాదాపు ఇరవై నిమిషాలు... కొట్టుకుపోతున్నంత వేగంగా... హోరుగాలి... అంతా పేవ్‌మెంట్ల మీదికొచ్చి నిల్చున్నారు.

తర్వాత గాలి నిశ్శబ్దమైపోయింది... అందరి ముఖాల్లోనూ ఆందోళన...

ఊడ్చిన రోడ్లన్నీ మళ్లీ చెత్తతో నిండిపోయాయి.

సుజాతకి నీరసం ముంచుకొచ్చింది.

కాంట్రాక్టర్ గాడి జీపు కన్పించింది. ఇంకా అందరి గుండెలు గుభేలుమన్నాయి. వాడు తప్పక మళ్లీ ఊడ్వమంటాడు. ఇలాగే వర్షాకాలంలో చాలాసార్లు అంతా ఊడ్చాక వర్షం కురుస్తుంది... కార్పోరేషన్ కంపు పొంగి పొర్లుతుంది. దాంతో మళ్లీ మళ్లీ ఊడ్వాల్సి వచ్చేది. ఎండాకాలమైతే ఇలాంటి గాలులు ఎప్పుడూ కలవరపెడతాయి.

కాంట్రాక్టర్ జీపు ఆగగానే అందరూ జీపు దగ్గరగా వెళ్లారు. "గాలి దుమారం మళ్లీ వచ్చిందా... సరేకానీ మళ్లీ నీట్‌గా ఊడ్చండి. వెహికిల్స్ రాక ముందు... ఎందుకంటే ఈరోజు పదిగంటలకు ప్రపంచబ్యాంక్ ప్రతినిధులు సిటీకి వస్తుంద్రట... ఇప్పటికి నాలుగుసార్లు 'క్లీన్‌సిటి' అవార్డునందుకున్న కార్పోరేషనాయె... వాళ్లొచ్చినప్పుడు చెత్త కన్పడితే నా కాంట్రాక్టు పోతుంది. మీ పని వూడుతుంది జాగర్త...." అని హెచ్చరించి వెళ్లిపోయాడు.

సగం మందికి సగం కూడా అర్థం కాలేదు. మొత్తానికి ఎవరో పెద్దోల్లు వస్తున్నారు. మళ్లీ ఊడ్చాలి అన్నది అర్థమై అయిష్టంగానే చీపురు అందుకున్నారు.

"బండ్లు రోడ్లెక్కుతున్నాయ్... కాంట్రాక్టర్‌గాడు మళ్లీ వస్తాడు. చీపురందుకో మరదలా..." సరస్వతి ఆదుర్దా పెట్టింది.

సుజాత చీపురందుకుంది... బాధగా... బరువుగా... చీపురు కదలటం లేదు. నడుం లాగుతోంది... కాళ్లూ చేతులు మొద్దుబారిపోతున్నాయి...

అయినా ఊడ్చేయాలి...

నమ్మిన మబ్బులు మోసగిస్తాయి..

ఊపిరనుకున్న గాలి కబలిస్తుంది...

కమ్ముకునే చీకటి స్వప్నాల్ని ఉరితీస్తుంది...

వెలుగొస్తుందంటేనే భయం... తెల్లారక ముందే ఊడ్చేయాలి... లేదంటే పనిలోంచి చీపురు పుల్లలా తీసేస్తారు... భయంతో ఊడ్చింది.

×××           ×××           ×××

తెల్లవారగానే... ఇంటికి చేరిన సుజాత ఇంకా నిద్రలేవని కొడుకుని, భర్తని చూసి హమ్మయ్య అనుకుంది. ప్లాస్టిక్ బిందె తీసుకొని నల్లా నీళ్లు పట్టుకొచ్చింది. నిద్ర కమ్ముకొస్తున్నా బలవంతంగా ఆపుకుంటూ గిన్నెలన్నీ తోమి అన్నం, కూర వండింది.

బిడ్డ లేవగానే పాలిచ్చింది.

భర్త లేచి సద్దిగిన్నె కట్టగానే అది తీసుకొని పనికెళ్లిపోయాడు. మొహం కడుక్కొని తనూ నాలుగు మెతుకులు తిన్నది.

ఎప్పుడు నిద్ర పట్టిందో తెలియదు కాని... ఒంటిగంటకు మెలకువొచ్చింది. పిల్లాడు ఆడుకుంటున్నాడు...

సుజాత వణికిపోతూనే... కోపంగా మూలనున్న చీపురుని చేతుల్లోకి తీసుకుంది.

అదిప్పుడు బలమైన మారణాయుధమే...

దిక్కులు చూసింది...

కాని... శత్రువు కన్పించలేదు...

అప్పటికే బాబు ఏడుపందుకున్నాడు... నిస్సహాయంగా కూలబడి బాబుని ఒళ్లోకి తీసుకొని రొమ్మునోట్లో పెట్టింది...

పాలందక వాడింకా ఏడుస్తూనే వున్నాడు. *